RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | మంగళవారం | 02- 04- 2024

సంపుటి : 1 | సంచిక : 299 | పేజీలు : 4 | వెల : 5.00

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా..

మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :



మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ వాయిదా పడింది. ఈ నెల 2వ తేదీన జరగాల్సిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ వాయిదా వేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో కౌంటింగ్ చేపట్టొద్దంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వాయిదా వేయాలని కోరింది. పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ పూర్తయిన తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. జూన్ 2వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# కేసీఆర్‌ది చిల్లర ప్రచారం



- కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలే..
- గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టింది
- కేసీఆర్‌పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదు
- రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్

ఢిల్లీ, ప్రభాతసూర్యుడు :

తెలంగాణ ప్రజలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మోయలేని భారం మోపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం నాడు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ చెప్పేవన్నీ కట్టు కథలేనని అన్నారు. జనరేటర్ పవర్‌తో నిన్నటి సభలో కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి మధ్యలో కరెంట్ పోయిందని చిల్లర ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసినా కేసీఆర్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇంగిత జ్ఞానం లేకుండా ప్రజలను కేసీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు వేల మెగావాట్ల పవర్ తెలంగాణకు ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉందని చెప్పారు. 2400 మెగావాట్ల పీపీఏ అగ్రిమెంట్లు చేసుకోకుండా కేసీఆర్ కుట్ర చేశారని మండిపడ్డారు. ఆయన పాపం వల్లే ఎన్టీపీసీ రాష్ట్రానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు నేతలు లాభం కోసం కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీపీసీ వల్ల కరెంట్ యూనిట్‌కు 9 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఆసంస్థకు లక్ష పదివేల కోట్ల రూపాయలను గత కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనకు వస్తున్నామని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పూర్తి చేశామని గుర్తుచేశారు. కేసీఆర్ లాగా ప్రధానమంత్రి కావడానికి పది రోజులు ఇక్కడే ఉండి కుట్రలు చేయలేదన్నారు. తాము ఇతరులతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం కాల్వల్లోకి కేసీఆర్ నీరు వదిలారన్నారు. ఇప్పటికే తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని, కరెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొంది స్తున్నామని అన్నారు. 2019 లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే మొదటి నెల ఉద్యోగులకు జీతాలు ఇచ్చిందని... తాము వచ్చిన తర్వాత ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇచ్చామని చెప్పారు. రూ. 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను పెడితే అవి కూడా ఇచ్చుకుంటూ వచ్చామన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 ఉచిత విద్యుత్ ఇచ్చామన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చామని చెప్పారు. 5 ఏళ్లలో మహిళలకు వడ్డీలేని లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని తెలిపారు. పంట నష్టం జరిగిన వెంటనే రైతులను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చాకే వర్షాలు రావడం లేదని కేసీఆర్ అంటున్నారని... జూన్‌లో ప్రభుత్వం బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న దగ్గరి నుంచే వర్షాలు రావట్లేదన్నారు. రిజర్వా యర్‌లో ఎక్కడ నీళ్లు లేకున్నా అది కేసీఆర్ పుణ్యమే నని చెప్పారు. నీటిని సద్వినియోగం చేసుకోకపోవ డం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో నీళ్లు లేకుండా కేసీఆర్ చేశారని భట్టివిక్రమార్క మండిపడ్డారు.

## బండి సంజయ్ ఏమి చేశారో చెప్పాలి




సిద్దిపేట జిల్లా, ఢిల్లీ, ప్రభాతసూర్యుడు :

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ప్రధాని మోదీ ఫొటోతో గెలిచే పరిస్థితిలో లేరని.. అందుకనే అయోధ్య రాముడి ఫొటోతో ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 5 ఏళ్లలో కరీంనగర్ జిల్లా అభివృద్ధికి ఎంపీ బండి సంజయ్ ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. తాను జిల్లాను ఎలా చేశానో ప్రజల అందరికీ తెలుసునని చెప్పారు. సోమవారం నాడు కోహెడ మండలంలోని శనిగరం పెద్ద చెరువును ఆకస్మికంగా సందర్శించారు. శనిగరం గ్రామంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని , అక్కడ అవసరమైన బోర్ వేల్స్ వేసుకోవడంతో పాటు అదనపు మోటార్లు ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సెక్రెటరీతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాలల్లో తరగతి గదులకు కలర్స్ వేయడంతో పాటు టాయిలెట్స్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో ఈసారి ముందుగానే భూగర్భ జలాలు పడిపోయాయన్నారు. కాంగ్రెస్ కరువు తెచ్చిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటున్నారని.. కానీ బీఆర్ఎస్ తెచ్చిన కరువు ఇదని ఎద్దేవా చేశారు. గ్రామానికి , మండలానికి, నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను 24ఐ7 ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ప్రతి గ్రామగ్రామాన పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కొంతమంది భూ పంచాయతీలల్లో తనను ఇన్వాల్వ్ చేస్తున్నారని.. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## కేసీఆర్‌లా కేఏ పాల్ అబద్ధాలు చెప్పడు

వరంగల్, ప్రభాతసూర్యుడు :



తాను పుట్టింది వరంగల్‌లోనేనని ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బాబు మోహన్ వెల్లడించారు. ఆ నగరంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. హనుమకొండ జిల్లా ములుగు రోడ్డులోని శ్రీసాయి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నగరానికి ఎప్పుడు వచ్చినా తన అడ్డా మాత్రం కరుణపురంలోనే అని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజాశాంతి పార్టీ నుంచే తాను ఎంపీగా పోటీ చేస్తానని బాబూ మోహన్ స్పష్టం చేశారు. తాను వేరే పార్టీ నుంచి పోటీ చేస్తానని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చీప్ రాజకీయాలు చేయవద్దంటూ ఆయన 2లో..

## వరంగల్ నుంచి కడియం కావ్యకే కాంగ్రెస్ టికెట్



ఢిల్లీ, ప్రభాతసూర్యుడు :

కాంగ్రెస్ పార్టీ సోమవారం రెండు స్థానాలకు అభ్యర్థుల ను ఖరారు చేసింది. మహారాష్ట్రలోని అకోల స్థానం నుంచి డాక్టర్ అభయ్ కాశీనాథ్ పాటిల్, తెలంగాణలోని వరంగల్ లోక్‌సభాస్థానం నుంచి కడియం కావ్య పేర్లు ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు తెలంగాణలో భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ నుంచి తొలుత వరంగల్ స్థానానికి కడియం కావ్య అభ్యర్థిత్వాన్నే ఖరారు చేసింది. అయితే, అవినీతి ఆరోపణలు, పార్టీలో సమన్వయ లోపం ఉందని, పార్టీ శ్రేణుల నుంచి తనకు సహకారం అందడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీ తరఫున అభ్యర్థిగా పోటీ చేయలేనని కడియం కావ్య ప్రకటించారు. తదుపరి తన తండ్రి, స్టేషన్ ఘన్ పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా కాంగ్రెస్ పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే వరంగల్ లోక్ సభ స్థానం అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఏఐసీసీ ఖరారు చేసింది.

## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఢిల్లీ, ప్రభాతసూర్యుడు :



ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్-04కు వాయిదా పడింది. ఏప్రిల్-04న మధ్యాహ్నం 2:30 గంటలకు రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట్టనున్నది. సోమవారం నాడు అటు ఈడీ .. ఇటు కవిత తరఫున లాయర్ల సుదీర్ఘ వాదనలు వినిపించారు. దీంతో.. ఈడీ రిప్లై రిజాయిన్డర్‌కు కవిత తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్విసమయం కోరారు. దీనికోసం ఏప్రిల్-03 సాయంత్రానికి రిజాయిన్డర్ దాఖలు చేస్తామని సింఘ్వి వెల్లడించారు. కాగా.. కుమారుడి పరీక్షలు దృష్ట్యా బెయిల్ ఇవ్వాలని కోర్టును కవిత విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్-16 వరకు కవిత మధ్యంతర బెయిల్ కోరారు. మధ్యంతర బెయిల్‌తో పాటు రెగ్యులర్ బెయిల్ కూడా ఇవ్వాలని మను సింఘ్వి కోర్టును కోరారు. దీనిపై ఇవాళ సుదీర్ఘ విచారణ అనంతరం వాయిదా వేయడం జరిగింది. దీంతో ఏప్రిల్-03, 04 తారీఖుల్లో ఏం జరుగుతుందా..? అనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## అత్యంత వేగంగా బీఆర్ఎస్ పతనం ఖాయం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :



బీఆర్ఎస్ పార్టీ అత్యంత వేగంగా పతనం అవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కేసీఆర్ సహకరించలేదన్నారు. ప్రారంభోత్సవానికి మాత్రమే కేసీఆర్ వచ్చారని తెలిపారు. ఆ తర్వాత ఎప్పుడూ కేసీఆర్ దానిని పట్టించుకోలేదని విమర్శించారు. తండ్రీ, కొడుకులతోనే తెలంగాణ నాశనమయిందని వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌ను చూసి జాలిపడాలన్నారు. ఓటమి తర్వాత కూడా ఆయన సీఎం అయినట్టు ఫీల్ అవుతున్నారని అన్నారు. పదేళ్లుగా దేశంలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపైనే బీజేపీ ప్రచారం ఉంటుందని వెల్లడించారు. సీఎం కావాలనుకున్న కేటీఆర్ ఆశలయ అడియాశలు అయ్యాయన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా మోదీ పాలన సాగిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందన్నారు. ప్రజల బ్రతుకులు మారలేదన్నారు. తాత్కాలికంగా ఓట్లు పొందేందుకే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రపంచానికే సాయం చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. సంక్షేమం కోసం 34 లక్షల రూపాయలు ఖర్చు చేసింది మోదీ ప్రభుత్వమని తెలిపారు. దేశంలో డిజిటల్ విప్లవం తీసుకుని వచ్చామమని.. జీఎస్టీ వ్యాపారస్తులకు వరంగా మారుతోందన్నారు. 1.66 లక్షల కోట్ల రూపాయలు ప్రతి ఏటా జీఎస్టీ ద్వారా దేశానికి ఆదాయం వస్తుందన్నారు. 26,500 కోట్ల డిజిటల్ ట్యాన్జక్షన్స్ దేశవ్యాప్తంగా జరిగాయన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చాయన్నారు. జనధన్ ఖాతాలతో 2 లక్షల కోట్ల రూపాయలు నేడు వారి సేవింగ్స్ అకౌంట్‌లలో జమ చేసుకున్నారన్నారు. పన్ను రాయితీ 7 లక్షల రూపాయలకు పెంచింది మోదీ ప్రభుత్వమని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు 12 వేల కోట్ల రూపాయలు ఆర్థిక సాయం చేసిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంతో ప్రమాదాలు తగ్గిపోయాయన్నారు. 20 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌లకు విద్యుదీకరణ పూర్తి అయ్యిందన్నారు. రోడ్ నెట్వర్క్‌లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నామన్నారు. 101 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందజేశామని.. 411 కంపెనీలు దేశంలో సెల్‌ఫోన్ ఉత్పత్తి చేస్తున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## దమ్ముంటే.. కరెంట్ కోతల్లేవని చెప్పాలి

నల్లగొండ, ప్రభాతసూర్యుడు :



రాష్ట్ర మంత్రులకు దమ్ము, ధైర్యం ఉంటే కరెంట్ కోతల్లేవని, సాగునీటి కొరత లేదని రైతుల ముందుకు వచ్చి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామంలో రైతులు గన్నెబోయిన మల్లయ్య, బోర్ల రాంరెడ్డిని పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆనాటి తెలంగాణ రైతుల దుస్థితికి, అవస్థలకి చిహ్నంగా నిలిచిన బోర్ల రాంరెడ్డిని, ఆయన దీన పరిస్థితిని కేసీఆర్ వందల సార్లు చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. ముషంపల్లికి చెందిన రాంరెడ్డి పేరు బోర్ల రాంరెడ్డిగా మారింది. గన్నెబోయిన మల్లయ్య యాదవ్, బోర్ల రాంరెడ్డి పరిస్థితులు తెలుసుకున్న తర్వాత మనసున్న ప్రతి ఒక్కరికి బాధ కలుగుతుంది. అందుకే 2లో..

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## కేసీఆర్‌లా కేఏ పాల్ అబద్ధాలు చెప్పడు

మొదటిపేజీ తరువాయి


ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ ప్రజలు తనను గెలిపించాలని... అందరూ శెభాష్ అనేలా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సమాజానికి మంచి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌లాగా తమ పార్టీ అధినేత కేఏ పాల్ అబద్ధాలు చెప్పరనన్నారు. టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ నేతలు మోసం చేశారని.. ఆ పార్టీ నేతల వ్యవహారశైలిపై మండిపడ్డారు. తాను గెలిచిన తర్వాత పేదలందరికీ పింఛన్లు ఇప్పిస్తానని.. అలాగే ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తానని బాబూ మోహన్ ప్రకటించారు.

## డీకే అరుణే వల్లే పాలమూరులో కరువు



మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :
బీజేపీ సీనియర్ నేత డీకే అరుణ వల్లే పాలమూరులో కరువు పరిస్థితులు వచ్చాయని టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాతఅన్నారు. రాజకీయాలతో డీకే అరుణ, ఆమె కుటుంబం బాగుపడింది తప్ప పాలమూరు జిల్లాకు ఎలాంటి లాభం కలగలేదని చెప్పారు. సోమవారం నాడు గాంధీభవన్‌లో కాల్వ సుజాత మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్ లో మంత్రిగా పని చేసి, ఎమ్మెల్యేగా దీర్ఘ కాలం పని చేసిన అరుణ పాలమూరు జిల్లాకు ఏమి చేశారో చెపితే బాగుంటుందన్నారు. దొరసాని అన్నందుకే జడుసుకుంటున్న అరుణ.. గతంలో సీఎం రేవంత్ రెడ్డి గురించి ఎలాంటి మాటలు మాట్లాడిందో పాలమూరు ప్రజలకు తెలుసునని చెప్పారు. పాలమూరు కరువుకు అరుణ కారణం కాదా అని ప్రశ్నించారు. జాతీయ నాయకురాలిగా మంచి రాజకీయ పరిచాయలున్న ఆమె పాలమూరు జిల్లాకు చేసిన ప్రగతి ఏంటని నిలదీశారు. పదేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం పాలమూరు జిల్లాకు ఒక్క పైసా అయిన ఇచ్చిందా అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం జాతీయ హెూదా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. నిరుద్యోగుల ఉపాధి కోసం ఒక్క పరిశ్రమ అయిన తెచ్చారా అని ప్రశ్నించారు. పాలమూరు కరువుకు, వలసలకు కారణం అరుణేనని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆమె చేసింది ఏమిటో చెప్పి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడగాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో అరుణ ఓడిపోవడం ఖాయమని కాల్వ సుజాత అన్నారు.

## టెట్ అభ్యర్థులపై ఆసక్తి చూపడంలేదు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై అభ్యర్థులు ఆసక్తి చూపడంలేదు. దరఖాస్తులు అంతంతమాత్రంగానే నమోదవుతున్నాయి. మార్చి 27 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనప్పటి నుంచి సోమవారం వరకు 43 వేల మంది మాత్రమే టెట్ దరఖాస్తులు సమర్పించారు. వీరిలో పేపర్ –1కు 15,768 మంది దరఖాస్తు చేయగా, పేపర్ –2కు 24,050 దరఖాస్తులు వచ్చాయి. ఈ రెండు పేపర్లకు హాజరయ్యేందుకు 4,173 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారు. దీంతో మొత్తం 43,991 మంది అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేశారు. టెట్ దరఖాస్తుల గడువు ఈ నెల 10న ముగియనున్నది. గతంలో టెట్ నిర్వహించినప్పుడల్లా 4లక్షల మంది దరఖాస్తు చేసేవారు. వీరంతా నిరుద్యోగులే. అయితే ఈ ఏడాది సర్వీస్ టీచర్లు కూడా పదోన్నతుల కోసం టెట్‌కు హాజరవుతున్నారు. దీంతో టెట్‌కు భారీగా దరఖాస్తులొస్తాయన్న అంచనాలున్నాయి. దాదాపు 5 లక్షల వరకు దరఖాస్తులొస్తాయని అధికారులు ఆశించారు. కానీ అంతగా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఈ సారి టెట్ ఫీజును రూ. 400 నుంచి ఒక పేపర్‌కు వెయ్యి, రెండు పేపర్లకు రెండు వేలు పెంచారు. దీంతో నిరుద్యోగులు ఈ ఫీజులను చూసి దరఖాస్తు చేసేందుకు జంకుతున్నారు. ఆర్థికభారంతో చితికిపోయినవారంతా టెట్‌కు దరఖాస్తు చేసేందుకు ముందుకురావడంలేదు. ఈ కారణంగానే దరఖాస్తుల సంఖ్య తగ్గాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో టెట్‌లో క్వాలిపై అయిన వారూ స్కోర్‌ను మెరుగుపర్చుకునేందుకు టెట్ పరీక్షరాసేవారు. టెట్ స్కోర్ వ్యవధిని జీవితకాలం పొడగించడం, ఫీజులు భారీగా పెంచడంతో ఇక అవసరంలేదన్న భావనతో టెట్‌కు దూరంగా ఉంటున్నారు. మొత్తంమీద దరఖాస్తులు తగ్గేందుకు ఫీజుల పెంపుయే ప్రధాన కారణమని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

# వడదెబ్బపై ప్రజలను చైతన్యవంతులను చేయాలి

- మంచినీటి సరఫరా పర్యవేక్షణకు స్పెషల్..
- ధాన్యం కొనుగోలుకు 7149 కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
ప్రస్తుత ఏప్రిల్, మే మాసాల్లో ఎండల నేపథ్యంలో వడదెబ్బ, డీ హైడ్రేషన్ బారినపడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా, ఎండల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందుజాగ్రత్త చర్యలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రెండు మాసాల్లో రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణా ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకుని తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా వేసవిలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజలను పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, ఇతర మందులను పెద్ద మొత్తంలో పంపిణీ చేశామన్నారు. వాటన్నింటినీ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో అందుబాటులో ఉంచినట్లు శాంతి కుమారి తెలిపారు. ఓఆర్ఎస్ పాకెట్లను కూడా ప్రతీ ఆశ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయని.. ఉపాధిహామీ పనుల కేంద్రాల వద్ద కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ ఒక్కరూ ఎండదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత చర్యలను చేపట్టాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా పర్యవేక్షణకు స్పెషల్ అధికారులు రాష్ట్రంలో మంచినీటి సరఫరాను మరింత సమర్థవంతంగా చేసేందుకు ప్రతీ మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్టు సీఎస్ పేర్కొన్నారు. ప్రతీ రోజు మంచినీటి సరఫరాను పర్యవేక్షించడానికి ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని, ప్రతీవార్డు, గ్రామానికి మండల స్థాయి అధికారిని నియమిస్తున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం జిల్లాలో మంచినీటి సరఫరాను పర్యవేక్షిస్తారని అన్నారు. ఏ గ్రామంలోనైనా మంచినీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే, ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బావుల నుంచి అద్దె ప్రాతిపదికపై నీటిని సరఫరా చేయాలని సూచించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని అందించాలన్నారు. ఇప్పటికే, అన్ని గ్రామాలు, వార్డులలోని బోరుబావుల మరమ్మతులు, ఫ్లషింగ్ లను పూర్తి చేయడంతోపాటు పైప్ లైన్ల లీకేజీలను అరికట్టినట్లు తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి పాలేరు జలాశయానికి తాగునీటి అవసరాలకు నేడు ఉదయం కృష్ణా జలాలను విడుదల చేయడం జరిగిందన్నారు. పాలేరు ప్రాజెక్టుకు చేరుకునేలా నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు తగు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోలుకు 7149 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, మరో నాలుగైదు రోజుల్లో ఈ కేంద్రాలన్నీ ప్రారంభమవుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో ప్రైవేటు కాంటాలను తెరిచి ఎంఎస్పీ కన్నా తక్కువ ధరకు కొనుగోళ్లు చేసే వారిని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో మనవూరు –మనబడి కార్యక్రమం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులన్నింటినీ సంబంధిత ఏజెన్సీల ద్వారా వెంటనే ప్రారంభించి, వాటి పురోగతిని పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు.

# ట్యాపింగ్ వెనక ఎంత పెద్ద నాయకులు ఉన్నా శిక్ష పడుతుంది



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబం తప్పా మిగతా నేతలందరూ కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, తమ పాలన చూసే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన గాంధీభవన్ వద్ద మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. నల్గొండ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ , బీజేపీ లకు డిపాజిట్ కూడా రాదన్నారు. 14 ఎంపీ సీట్లు తప్పకుండా గెలుస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ తర్వాత అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వాళ్ళని వదిలే ప్రసక్తే లేదని, వంద శాతం తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ట్యాపింగ్ వెనక ఎంత పెద్ద నాయకులు ఉన్నా శిక్ష పడుతుందన్నారు. కూతురు కవిత ఒక కేసులో ఇరుక్కుపోయిందని, గొర్రెల స్కాంలో కొందరు ఇరుక్కుపోయారని, ఇక ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరెవరు ఇరుకుతారోనని బీఆర్ఎస్ వాళ్ళకి భయంగా ఉందన్నారు. రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, తెలంగాణలో తాగునీటి సమస్య, కరెంట్ సమస్య లేదని చెప్పారు. కేసీఆర్‌లా ఫామ్ హౌజ్‌లో పండుకునే అలవాటు తమకు లేదన్నారు. ప్రతి రోజూ సచివాలయానికి వస్తున్నామని, ప్రతి సమస్యపై వారం.. పదిరోజులకొకసారి రివ్యూ చేస్తున్నామని చెప్పారు.

కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు దాబాయింపు చేశారని, బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం కల్ల అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఆదివారం మీడియాతో మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిన్న కేసీఆర్ స్పీచ్ విన్నాక ఇంత సిగ్గు లేకుండా ఎలా మాట్లా డారు అని అనిపించిందన్నారు. ఒడిపోవడ మే కాదు, పార్టీ మిగలదు అనే భయం కేసీఆర్‌లో మొదలైందన్నారు. పొంగనాలకు పోయి జాతీయ పార్టీ అన్నారని.. ఇంత తొందరగా ఏ పార్టీ కుప్ప కూలిపోలేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదని అన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు అవుట్ డేటెడ్ టెక్నాలజీ అని.. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు వల్ల ప్రజలకే భారమన్నారు. రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా పవర్ పోవడం లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# దమ్ముంటే.. కరెంట్ కోతల్లేవని చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

మల్లన్నను ప్రత్యేకంగా కలిసేందుకు ఈరోజు ముషంపల్లికి రావడం జరిగింది. రాంరెడ్డి అన్నను కలిసినా, మల్లన్నను కలిసినా, కొంతమంది మహిళలను కలిసినా, గత పది సంవత్సరాలలో ఏ రోజు తాగునీటికి, సాగునీటికి కొరత రాలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంటలు ఎండిపోయినయ్, తాగునీరు దొరకని పరిస్థితి ఉందని తమ దీనావస్థను చెప్పుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ పర్యటన భయంతో.. నీళ్లను ఎత్తిపోస్తున్నారు..ఇది కాలం తెచ్చిన కరువు కాదు, అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని ప్రతి ఒక్కరు చెబుతున్నారు. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపించాలని రిజర్వాయర్లలో నీళ్ళు నింపకుండా ఈ ప్రభుత్వం నాటకాలు ఆడింది. కానీ కేసీఆర్ పర్యటన భయంతో నంది పంప్ హౌస్‌లో ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోసి కరీంనగర్‌కు నీళ్లు వదిలారు. నిన్నటిదాకా కాళేశ్వరం ఫెయిల్ అయిందని చెప్పి.. కానీ ఇదే రోజు అదే బాహుబలి మోటార్లతో కరీంనగర్‌కు నీళ్లు అందిస్తున్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు నాగార్జునసాగర్ నుంచి మొదలుకొని టేయిల్ ఎండ్ దాకా ప్రతి ఒక్కరికి సాగునీరు అందింది. గత పది సంవత్సరాలలో ఏనాడు ఒక బోరు వెయ్యాల్సిన పరిస్థితి రాలేదు. కానీ గత నాలుగు నెలల్లో ఆరు బోర్లు వేసిన పరిస్థితి ఉందని రాంరెడ్డి చెప్పారు. ఈరోజు రైతాంగం పరిస్థితి దారుణంగా ఉంది.. చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వల్ల కలిగింది ఈ దుస్థితి. వంద పది రోజులు అయినా కూడా నీళ్లు అందించలేని అసమర్థ పరిస్థితి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. కేవలం కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న దుర్మార్గపూరిత, చిల్లర తాపత్రయంతో లక్షల మంది రైతుల పంటలను ఎండబెట్టింది. ఎక్కడెక్కడ అయితే పంట నష్టం జరిగిందో అక్కడ ఎకరానికి రూ. 25 వేల పంట నష్టం అందించాలి. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు కాంగ్రెస్ తెచ్చిన దుస్థితి.. కాబట్టి మీరు పరిహారం వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి కానీ, ఒక్క మంత్రి కానీ రైతుల వద్దకి వెళ్లి పరామర్శించిన పాపాన పోలేదు. కానీ ప్రధాన ప్రతిపక్షంగా మేము, మా నాయకుడు కేసీఆర్ తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా మూడు నాలుగు జిల్లాలు తిరిగి రైతులకు పరామర్శించి ధైర్యం చెబుతున్నారు. రైతాంగానికి ధైర్యం చెప్పే బాధ్యత ప్రభుత్వానికి లేదా..? ముఖ్యమంత్రి ఎక్కడున్నాడుసమాధానం చెప్పాలి. రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన పొంకణాల పోతిరెడ్డి రేవంత్ రెడ్డి ఎక్కడ పోయిండు..? వెంటనే రుణమాఫీ చేయనందుకు రాష్ట్ర రైతాంగానికి క్షమాపణ చెప్పాలి. రాష్ట్ర రైతాంగం పక్షాన మా బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుంది. ఇప్పటికే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. రైతులు ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వెంటనే క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచైనా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తీసుకువస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమస్యను పరిష్కరించకుండా ఉత్త మాటలు మాట్లాడుతున్నాడు.

రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులంతా కూడా రాజకీయ చేరికల పైన దృష్టి పెట్టారు కానీ రైతాంగం సమస్యల పైన పెట్టలేదు. స్వయంగా ముఖ్యమంత్రి కేశవరావు ఇంటికి వెళ్ళినప్పుడు కూడా కరెంటు పోయింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎంత బుఖాయించిన వాస్తవాలు వాస్తవాలే గాని అబద్ధాలు కావు. రాష్ట్ర మంత్రులకు దమ్ము, ధైర్యం ఉంటే రైతుల ముందుకు వచ్చి కరెంటు కోతలు, సాగునీటి కొరత లేదని చెప్పాలి. ఇదే మాట ముషంపల్లికి వచ్చి రైతులతో చెప్పాలని మంత్రులకు కేటీఆర్ సవాల్ విసిరారు. తమ పంటలు అన్ని ఎండిపోయి అప్పుల పాలయ్యామని, కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులు బాగున్నారని, మళ్ళీ కేసీఆర్ సీఎం కావాలని మల్లయ్య ఇటీవలే ఆకాంక్షించారు.

మల్లయ్య వీడియో చూసి చలించిపోయిన కేటీఆర్.. నల్లగొండ వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తా అని ట్విట్టర్‌లో తెలిపారు.. ఇచ్చిన మాట నిలుపుకుంటూ ఇవ్వాళ ముషంపల్లి గ్రామంలో రైతు మల్లయ్యను కేటీఆర్ కలిశారు.

## గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

వనపర్తి, ప్రభాతసూర్యుడు :
వనపర్తి జిల్లా పెబ్బేరుమండల కేంద్రంలోని వ్యవసాయ గోదాంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు మార్కెట్ గోదాంలో మంటలు చెలరేగి గన్నీ బ్యాగులు, వడ్ల బస్తాలు దగ్ధమయ్యాయి. భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం జరిగిన వెంటనే మార్కెట్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. ప్రమాదం జరిగే సమయంలో 70 వేల ధాన్యం బస్తాలు, 15 లక్షల గన్నీ సంచులు ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



RNI: TELTEL12215 https://www.youtube.com/@PrabhathaSuryuduNews https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## భక్తుల ఇంటికే సీతారాముల తలంబ్రాలు..




**భద్రాచలం, ప్రభాతసూర్యుడు :**

తెలంగాణలో ఉన్న రాములోరి భక్తులకు టీఎస్ ఆర్టీసీ గుడ్ న్యూస్ వినిపించింది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే సీతారాముల కళ్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కళ్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టీఎస్ఆర్టీసీ హెూం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. “నియమ నిష్ఠలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా ఎన్నో ఏళ్లుగా రాములోరి కళ్యాణంలో ఉపయోగిస్తున్నారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని రెండేళ్ల క్రితమే టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ ప్రయత్నానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది. సంస్థపై ఉన్న విశ్వాసంతో భక్తులు భారీ సంఖ్యలో తలంబ్రాలను బుక్ చేసుకుంటున్నారు. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా.. గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసింది.” అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. భద్రాద్రిలో ఈ నెల 17న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని వినియోగించుకోవాలని టీఎస్ఆర్టీసీ కోరుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కూడా భక్తుల వద్ద నేరుగా ఆర్డర్లను స్వీకరిస్తారని తెలిపారు. తలంబ్రాల సేవను పొందాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ ఫోన్ నంబర్లైన 040-23450033, 040-69440000, 040-69440069 ను సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

## శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల

**ప్రభాతసూర్యుడు డెస్క్:**

శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా టాలీవుడ్ నటి శ్రీలీల నియమితులయ్యారు. విద్యారంగంలో అనేక విజయాలను నమోదు చేశామని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలయిన ఐఐటీ- జేఈఈ, నీట్‌లలో కిందటేడాది మూడు నంబర్ వన్ ర్యాంకులను కైవసం చేసుకున్నామని సంస్థ డైరెక్టర్ బొప్పన సుష్మశ్రీ పేర్కొన్నారు.శ్రీలీలను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం ద్వారా మరో ముందడుగు వేశామన్నారు.ప్రజలకు మరింత చేరువవుతామని పేర్కొన్నారు. 39 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీచైతన్య విద్యాసంస్థలు, ఎడ్యుకేషన్ సెక్టార్‌లో విప్లవాత్మక బోధనా పద్ధతులతో ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తీర్చిదిద్దాయి. ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి నేషనల్ లెవెల్ పోటీ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించాయి’ అని సుష్మశ్రీ అన్నారు. అగ్రశ్రేణి అధ్యాపక బృందం పర్యవేక్షణలో ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని, పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికాబద్ధమైన బోధనా విధానాలను ప్రవేశ పెట్టామని పేర్కొన్నారు. విద్యారంగంలో శ్రీచైతన్య అంటే ఒక అద్వితీయమైన శక్తి అని శ్రీలీల అన్నారు. విద్యార్థులను విజయ తీరాలకు చేర్చే దిక్సూచి అని కొనియాడారు.

## పీఎల్ఐతో వచ్చిన పెట్టుబడులు ..
## రూ.1.06 లక్షల కోట్లు



**ప్రభాతసూర్యుడు డెస్క్:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీమ్ పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించింది. మొత్తం 14 సెక్టార్ల కోసం ఈ స్కీమ్‌ను ప్రకటించగా, కిందటేడాది డిసెంబర్ నాటికి రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రభుత్వ డేటా ప్రకారం, పెట్టుబడులను ఆకర్షించడంలో ఫార్మా, సోలార్ మాడ్యూల్స్ సెక్టార్లు టాప్‌లో ఉన్నాయి. ఐటీ హార్డ్‌వేర్, ఆటో, ఆటో కాంపోనెంట్స్, టెక్స్‌టైల్స్, ఏసీసీ బ్యాటరీ స్టోరేజ్ సెక్టార్లలో పీఎల్ఐ స్కీమ్‌కు పెద్దగా రెస్పాన్స్ లేదు.టెలీకమ్యూనికేషన్, వైట్ గూడ్స్, టెక్స్‌టైల్స్, మెడికల్ డివైజ్‌ల తయారీ, ఆటోమొబైల్స్, స్పెషాలిటీ స్టీల్, ఫుడ్ ప్రొడక్ట్‌లు, సోలార్ పీవీ మాడ్యుల్స్, అడ్వాన్స్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ, డ్రోన్స్, ఫార్మా వంటి 14 సెక్టార్ల కోసం 2021 లో ప్రభుత్వం పీఎల్ఐ స్కీమ్‌ను ప్రకటించింది. కిందటేడాది డిసెంబర్ నాటికి ఫార్మాస్యూటికల్ సెక్టార్ రూ.25,813 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఇది అంచనా వేసిన రూ.17,275 కోట్లు కంటే ఎక్కువ. డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్, సిప్లా, గ్లెన్‌మార్క్ ఫార్మా, బయోకాన్, వోఖ్హర్ట్ లిమిటెడ్ పీఎల్ఐ స్కీమ్ వలన లాభపడ్డాయి. హై ఎఫీషియెన్సీ సోలార్ పీవీ మాడ్యూల్స్ సెక్టార్ రూ.22,904 కోట్లను ఆకర్షించగలిగింది. కానీ, రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ సెక్టార్‌లో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, రిలయన్స్ న్యూ ఎనర్జీ సోలార్, అదానీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టాటా పవర్ సోలార్ కంపెనీలు ప్రయోజనం పొందాయి. బల్క్ డ్రగ్స్ సెక్టార్‌లోకి రూ.3,586 కోట్లు( అంచనా వేసింది రూ.3,939 కోట్లు) వచ్చాయి. మెడికల్ డివైజ్ సెక్టార్‌లోకి రూ.1,330 కోట్ల పెట్టుబడుల వస్తాయని అంచనా వేయగా, రూ. 864 కోట్లు వచ్చాయి.

# పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



**పెద్దపల్లి, ప్రభాతసూర్యుడు :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విషయంలో ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్షాలు అధిక శాతంలో పడకపోవడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. బీఅర్ఎస్, బీజేపీ ప్రభుత్వం మాటల వరకే పరిమి తం తప్పా ఆచరణలో పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందిస్తుందన్నా రు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం. ఆ తర్వాతే ఎన్నికలకు పోతామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ సీట్లు గెలవడం కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎంపీ టికెట్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం అన్నివర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాని సింగ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వానికి కనికరం లేదు



**రాజన్న సిరిసిల్ల, ప్రభాతసూర్యుడు :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై దయాదాక్షిణ్యం లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయంలో నీళ్లు లేక తేలిన శాబాష్‌పల్లె రోడ్డు, బీటలు వారిన భూమిని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు సాగునీరు లేక తల్లడిల్లు తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులపై కాఠిన్యంగా వ్యవహరిస్తూ సాగునీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు.గోదావరిలో రోజురోజుకూ వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతూ సముద్రంలో కలిసిపోతుందన్నారు.మేడిగడ్డ వద్ద రక్షణ చర్యలు చేపడితే రైతులకు ఈ విధమైన పరిస్థితి వచ్చేది కాదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రాజెక్టులను గాలికి వదిలేసి అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్‌పై అసత్య ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు చేతగానితనం, అసమర్థత కారణంగానే మేడిగడ్డ దగ్గర ఉన్న వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుందన్నారు. ఎండిన పంట పొలాలను సర్వే చేయించి ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు బోయినపల్లి మండల కేంద్రం లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్య క్రమాల్లో మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత మాధవ్, జిల్లా నాయకులు చెన్నాడి అమిత్ కుమార్, వైస్ ఎంపీపీ నాగయ్య, మండలాధ్యక్షు డు కొండయ్య, నాయకులున్నారు.

## రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాన్ని అడ్డుకుంటాం




**ఆలేరు, ప్రభాతసూర్యుడు :**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య న చిచ్చుపెట్టి మూడోసారి అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని మార్చాలన్న వారి ప్రయత్నాన్ని అడ్డుకుంటామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. సోమవా రం ఆలేరులో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ చరిత్రలోనే ఎర్రజెండాకు ఎంతో గొప్ప పేరుందని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. డబ్బులున్నవారు తప్ప పోటీలో దిగడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, ప్రజా సేవను చేసే వారికే ఓట్లు వేసి గెలిపించాలన్నారు. బీజేపీ అత్యంత ప్రమాదకర మైన పార్టీ అని, ఆ పార్టీని తరిమికొట్టాలన్నారు. సీపీఎం పార్లమెంట్ అ?భ్యర్థి జహంగీర్, నాయ కులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దూపటి వెంకటేష్, బొలగాని జయరాములు, ఇక్బాల్, పౌల్, రమేష్, రాజు, పరుశరాములు ఉన్నారు.

**మోత్కూరు :**

రానున్న పార్లమెంటు ఎన్నికలు దేశ భవిష్య తను నిర్ణయించేవని, ఈ ఎన్నికల్లో ప్రజల కోసం పోరాడే వ్యక్తినే పార్లమెంటుకు పంపాలని సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ కోరారు. సోమ వారం రాత్రి మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం పార్టీ ప్రజా సమస్యలపై అనేక ఉద్యమా లు నిర్వహించి, ఎన్నో ఫలితాలు సాధించింద న్నారు. బీబీనగర్‌లో ఎయిమ్స్‌లో కనీస వసతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. జిల్లాలో ఇప్పటికీ సాగునీరే ప్రధాన సమస్య అన్నారు. బీబీనగర్ ఏయిమ్స్‌లో 750 పడకలకు గాను 150 పడకలే ఉన్నాయని, 42 డిపార్ట్‌మెంట్లకు గాను 25 డిపార్ట్‌మెంట్లే పనిచేస్తున్నాయని, రోజూ 1500 నుంచి 1800 మంది ఔట్ పేషంట్లు వస్తుండగా, వారి పేరు నమోదు చేసుకోవడానికి 20 కౌంట ర్లు తెరవాల్సి ఉండగా కేవలం ఆరు కౌంటర్లతో వెళ్లదీస్తున్నారన్నారు. ఇదేమిటని అడిగితే కంప్యూ టర్లు లేవంటున్నారన్నారు. కేంద్ర మంత్రి కిష నరెడ్డి, ఎంపీ అరవింద్ అందులో డైరెక్టర్లని, ఎయిమ్స్ సమస్యలపై ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమ వుతాయని, ఎన్నిక ల్లో ప్రజా ఉద్యమకారులనే ఎన్నుకుని పార్లమెం ట్‌కు పంపాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కల్లూరి మల్లేషం, జిల్లా కమిటి , మండలాల కార్యదర్శులు మెతుకు అంజయ్య తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**మోత్కూరు, ప్రభాతసూర్యుడు :**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.2203, సాధారణ రకం (బీ-గ్రేడ్) ధాన్యానికి రూ.2183 పొందాలని డీసీవో(డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్) బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మోత్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, మట్టి, తాలు లేకుండా కేంద్రాలకు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంటు రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్, జేఐ రంజితకుమార్, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, సంఘం సీఈవో కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ముశిపట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ డి.రాంప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో కె.స్వప్న, ఏపీఎం వెంకటేశ్వర్లు, కొల్లూరి అండాలు, ఎస్‌కె.మౌలాభి, బి.దేవేంద్ర పాల్గొన్నారు. అడ్డగూడూరు మండలంలోని లక్ష్మీదేవికాల్వ, జానకీపురం, కంచనపల్లి, ఆజీంపేట, వెల్దేవి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన పీఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం డీసీవో బి.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసీన కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీవో ప్రవీణ్ కుమారు మాట్లాడుతూ, రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఆసిస్టెంట్ రిజిష్టరు శ్రీనివాస్, సీఈవో వెంకటేశ్వర్లు, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు యాదయ్య, ప్రసాద్, ఏఈవో దయాకర్, వీబికె వీరలక్ష్మి ఉన్నారు. వలిగొండ మండలంలోని అరూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురునాథ్‌పల్లి, గంగాపురం, వెంకటాపురం, చిత్తాపురం, గోపరాజుపల్లి, అరూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కోఆపరేటీవ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, రంజితకుమార్‌రెడ్డి, సీఈవో కృష్ణ, ఏఈవో ప్రసన్న, పాల్గొన్నారు

## కొత్త ఆర్థిక సంవత్సరానికి భారీ లాభాలతో స్వాగతం!

**ప్రభాతసూర్యుడు డెస్క్:**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని సోమవారం లాభాలతో ప్రారంభించాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మార్కెట్లకు దన్నుగా నిలుస్తున్నాయి.ఉదయం 9:21 గంటల సమయంలో సెన్సెక్స్ 536 పాయింట్లు లాభపడి 74,188 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 168 పాయింట్లు పెరిగి 22,495 దగ్గర కొనసాగుతోంది.సెన్సెక్స్-30 సూచీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్, ఎల్ అండ్ టీ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ షేర్లు నష్టాల్లో కొనసాగుతు న్నాయి. అమెరికా మార్కెట్లు గతవారాన్ని స్వల్ప లాభాల తో ముగించాయి. నేడు ఆసియా ప్రధాన సూచీలు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 87.31 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ‘విదేశీ సంస్థాగత మదుపర్లు ’ గురువారం నికరంగా రూ.188.31 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. ‘దేశీయ సంస్థాగత మదుపర్లు’ రూ.2,691.52 కోట్ల స్టాక్స్‌ను కొన్నారు. మార్చి వాహన విక్రయాలు, జీఎస్‌టీ వసూళ్లు, పీఎంఐ గణాంకాలపై ఈవారం మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. ఏప్రిల్ 3-5

# బీఆర్ఎస్ ముఖ్య నేతల కనుసన్నల్లోనే జరింగిది



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధమున్న పలువురు సీనియర్ పోలీస్ అధికారులను అరెస్ట్ చేసి విచారిస్తున్న నేపథ్యంలో.. విస్తుపోయే నిజాలు బయటికొస్తున్నట్టు తెలుస్తోంది. కేవలం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమే కాకుండా.. కాల్ రికార్డింగ్స్ ఆధారంగా వసూళ్ల దందా కూడా చేపట్టినట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. అంతేకాకుండా.. ఎన్నికల సమయాల్లో పోలీసుల వాహనాల్లో అధికార పార్టీ డబ్బును తరలించినట్టు కూడా బయటికివచ్చినట్టు సమాచారం. అయితే.. ఈ కేసులో ఏ-4 నిందితుడిగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు అరెస్ట్ చేయగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అంతా బీఆర్ఎస్ ముఖ్య నేతల కనుసన్నల్లోనే జరింగిదని.. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాలతోనే ఫోన్లు ట్యాప్ చేసినట్టుగా విచారణలో వెల్లడించినట్టు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ద్వారా.. ప్రతిపక్ష పార్టీల ముఖ్య నాయకులు, వారి కుటుంబ సభ్యులు, వారికి ఆర్థికంగా మద్దతుగా నిలిచిన వ్యాపారవేత్తల కార్యకలాపాలపై ఎక్కువగా దృష్టి పెట్టినట్టు అంగీకరించామని ఒప్పుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా.. బీఆర్ఎస్ పార్టీలో కొంత మంది అనుమానిత నేతలపై కూడా నిఘా పెట్టినట్టు సమాచారం. మునుగోడు, హుజూరాబాద్, దుబ్బాక ఉన్న ఎన్నికల సమయంలో నేతలపై నిఘా పెంచామని తెలిపినట్టు రిపోర్టులో పోలీసులు పేర్కొన్నట్టు సమాచారం. 2016 నుంచి ఓ వర్గానికి చెందిన అధికారులతో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు రాధాకిషన్ రావు అంగీకరించినట్టు తెలుస్తోంది. కాగా.. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో భాగంగా.. భవ్య సిమెంట్ యజమాని ఆనంద్ ప్రసాద్ నుంచి రూ.70 లక్షలు సీజు చేసినట్లు రాధాకిషన్ రావు వెల్లడించినట్టు సమాచారం. అలాగే.. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థిగా ఉన్న రఘునందన్ రావు, ఆయన బంధువుల నుంచి కోటి రూపాయలు, మునుగోడు ఉపన ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెందిన మూడున్నర కోట్ల స్వాధీనం చేసుకున్నామని ఒప్పుకున్నట్టు సమాచారం. మరోవైపు.. 2018, 2023 ఎన్నికలతో పాటు.. దుబ్బాక, మునుగోడు ఉపఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కోసం టాస్క్ ఫోర్స్ వాహనాల్లో డబ్బులు తరలించినట్లు అంగీకరించినట్టు టాస్క్ ఫోర్స్ టీంకు ఆ వాహనాలను ఓ మాజీ ఐఏఎస్ అధికారి సమకూర్చినట్లు అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నట్టు తెలుస్తోంది.

## సినీఫక్కీలో శివానందరెడ్డి పరార్



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
ఏపీ టీడీపీ నేత మాంద్ర శివానందరెడ్డి సోమవారం తెలంగాణ సీసీఎస్ పోలీసుల కండ్లుగప్పి పారిపోయాడు. తనను అరెస్టు చేసేందుకు పోలీసులు తన ఇంటికి రావడాన్ని గమనించిన శివానందరెడ్డి.. బయటికి వెళ్లి, పోలీసులు రాకుండా గేటుకు తాళం వేసి పరారయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. నంద్యాల జిల్లా నందికొటూరు మండలం అల్లూరుకు చెందిన టీడీపీ ముఖ్యనేత, మాజీ ఐపీఎస్ అధికారి శివానందరెడ్డిపై హైదరాబాద్‌లో పలు కేసులు నమోదయ్యాయి.నగరంలోని ఓ భూ వివాదంలో క్రైమ్ నెంబర్ 194/2022లో శివానందరెడ్డిని అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసులు అల్లూరులోని ఆయన ఇంటికి వెళ్లి, అరెస్ట్ చేయబోతున్నట్టు తెలిపారు. దీంతో మొదట నోటీసు ఇవ్వాలని కోరి.. ఆ తర్వాత అరెస్ట్ వారెంట్ చూపాలన్నాడు. ఈ క్రమంలో పోలీసులు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా తెలివిగా ఇంటి నుంచి బయటికి వచ్చి, గేటుకు తాళం వేసి, కారులో ఉడాయించాడు.దీంతో అతడి భార్య, కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా బుద్వేలులో 26 ఎకరాలను అక్రమంగా విక్రయించాడంటూ సీసీఎస్ పెట్టిన కేసులో శివానందరెడ్డి భార్య, కుమారుడికి హైకోర్టులో ఊరట లభించింది. వారిద్దరిని అరెస్టు చేయొద్దని, ఒకవేళ అరెస్టు చేసుంటే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని సోమవారం ఆదేశించింది.

## అంతర్జాతీయ కరెన్సీగా రూపాయి

**ఢిల్లీ , ప్రభాతసూర్యుడు :**




అభివృద్ధే ఇక ఆర్‌బీఐ ప్రాధాన్యత: ప్రధాని మోదీముంబై: వచ్చే పదేళ్లలో మరిన్ని రంగాల్లో మన దేశం ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే ఇది అత్యంత అవసరమన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 90 వసంతాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే మన రూపాయిని అందరికీ ఆమోదయోగ్యమైన, అందుబాటులో ఉండే అంతర్జాతీయ కరెన్సీగా మార్చేందుకూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల పని భారం మరింత పెరుగుతుందన్నారు. ఉద్యోగులు ఇందుకు సిద్ధంగా ఉండాలని ప్రధాని కోరారు. ఇప్పటి వరకు ద్రవ్యోల్బణ కట్టడిపై ప్రధాన దృష్టి పెట్టిన ఆర్‌బీఐ వచ్చే పదేళ్లు, జీడీపీ వృద్ధి రేటు పెంచడాన్నే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో ద్రవ్య స్థిరత్వం, విశ్వసనీయతలపైనా ఆర్‌బీఐ దృష్టి పెట్టాలని సూచించారు.ఆర్‌బీఐ పాత్ర భేష్: జీడీపీ వృద్ధి రేటు వేగంగా, స్థిరంగా పెరగడంలో ఆర్‌బీఐ పోషించిన పాత్రను ప్రధాని మోదీ ప్రశంసించారు. ద్రవ్యోల్బణ కట్టడిలోనూ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) చురుకైన పాత్ర పోషించిందన్నారు. నిరంతరం ధరల పర్యవేక్షణ, స్థిరమైన ద్రవ్య విధానాల ద్వారా కొవిడ్ వంటి కష్ట సమయంలోనూ ఎంపీసీ ద్రవ్యోల్బణాన్ని పెద్దగా కోరలు చాచకుండా కాపాడిందన్నారు. కొవిడ్ ప్రభావంతో ఇంకా అనేక దేశాలు సతమతమవుతున్నా, భారత్ మాత్రం ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోందని ప్రధాని అన్నారు.ఆదుకున్న ఆర్‌బీఐ నైపుణ్యాలు: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కోవడంలో వృత్తిపరమైన ఆర్‌బీఐ నైపుణ్యాలు దేశానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బ్యాంకుల ఆస్తులు-అప్పుల పట్టికలను మెరుగుపరచడంలోనూ ఆర్‌బీఐ చర్యలు ఎంతో ఉపకరించాయన్నారు. గత పదేళ్లలో ఆర్‌బీఐ, ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగానే బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు.బలమైన ద్రవ్య వ్యవస్థే మా లక్ష్యం: వచ్చే పదేళ్లలో స్థిరమైన, బలమైన ద్రవ్య వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఆర్‌బీఐ లక్ష్యంగా ఉంటుందని ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి ఇది పునాది రాయిలా ఉపయోగపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు అవసరమైన విధాన మార్పులు తీసుకుంటున్న విషయాన్ని దాస్ గుర్తు చేశారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బ్యాంకుల విధానాలూ మారాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. దేశ భవిషత్ అభివృద్ధికి దోహదం చేసే రంగాలకు అవసరమైన రుణ వితరణపై బ్యాంకులు దృష్టి పెట్టాలని కోరారు. అంతరిక్ష రంగంలో ఉన్న కంపెనీలు, పర్యాటక రంగంలోని కంపెనీలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అయోధ్య ముందు ముందు అతిపెద్ద ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. బ్యాంకులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగాల్లోని కంపెనీల రుణ సాయంపై దృష్టి పెట్టాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌తో పాటు సైబర్ నేరాలు పెరిగి పోవడంపైనా ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బెడదను అరికట్టేందుకు బ్యాంకులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# తీహార్ జైలులో కేజ్రీవాల్



**ఢిల్లీ , ప్రభాతసూర్యుడు :**
ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం కేజ్రీవాల్‌కు కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్‌ను అధికారులు తీహార్ జైలుకు తరలించనున్నారు. ఈ క్రమంలోనే తీహార్ జైలులో కేజ్రీవాల్ ఎక్కడ ఉంటారు. ఆయనకు ఏమేం వసతులు ఉంటాయి. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు కేజ్రీవాల్ దినచర్య ఎలా ఉంటుంది. తీహార్ జైలులో ఇంకా ఆప్ నేతలు ఎవరెవరు ఉన్నారనే విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కలేదు. ఇప్పటికే 10 రోజుల పాటు ఈడీ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సోమవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. ఈసారి కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు కస్టడీకి అడగకపోవడంతో ఆయనకు కోర్టు.. జ్యుడీషియల్ కస్టడీకి విధించింది. ఈ క్రమంలోనే ఇప్పటికే ఈ ఢిల్లీ లిక్కర్ కేసు మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సంజయ్ సింగ్‌లతోపాటు కేజ్రీవాల్‌ను కూడా తీహార్ జైలుకు తరలించనున్నారు. తీహార్ జైలులో ఈ నెల 15 వ తేదీ వరకు కేజ్రీవాల్ ఉండనున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు తీహార్ జైలులో ఏ సెల్‌ను కేటాయించారు. ఆయన దినచర్య ఎలా ఉండనుంది. ఆయనకు ఎలాంటి వసతులు సమకూర్చనున్నారనేది ప్రస్తుతం తీవ్ర చర్చకు దారి తీస్తోంది.జైలులోని ఇతర ఖైదీల దినచర్య లాగానే అరవింద్ కేజ్రీవాల్‌కు దినచర్య కూడా ఉండనుంది. ఉదయం 6.30 గంటలకు నిద్రలేవడంతో కేజ్రీవాల్‌కు రోజు ప్రారంభం కానుంది. జైలులో ఉన్న నిందితులు, ఖైదీలకు బ్రేక్‌ఫాస్ట్‌గా టీ, బ్రెడ్ ముక్కలు ఇస్తారు. ఆ తర్వాత ఒకవేళ కేసు విచారణ ఉంటే కేజ్రీవాల్‌ను కోర్టుకు తీసుకువెళ్తారు. లేకపోతే ఆయన తరపున లాయర్ల బృందంతో కేజ్రీవాల్ సమావేశం కానున్నారు.

ఆ తర్వాత 10.30 నుంచి 11 గంటల మధ్య మధ్యాహ్న భోజనం ఉంటుంది. ఇక లంచ్‌లో పప్పు, సబ్జీ, 5 రొట్టెలు లేదా అన్నం వడ్డిస్తారు. లంచ్ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి ఖైదీలను సెల్‌లోనే ఉంచుతారు. ఆ తర్వాత 3.30 గంటలకు టీ, 2 బిస్కట్లు ఇస్తారు. అనంతరం 4 గంటలకు లాయర్లను కలుసుకునే అవకాశం ఉంటుంది. ఇక సాయంత్రం 5.30 గంటలకు ఎర్లీ డిన్నర్ ఉంటుంది. రాత్రి 7 గంటల నుంచి కేజ్రీవాల్‌ను జైలు గదిలోనే ఉంచుతారు.

## ఇకపై పంట వేసిన వారికే రైతుబంధు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
ఇక నుంచి పంట వేసిన వారికే పెట్టుబడి సాయం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. రైతుబంధు ఎవరికి ఏ విధంగా ఇవ్వాలనే అంశంపై వచ్చే శాసనసభ సమావేశాల్లో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామని అన్నారు. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ఈ నెలాఖరు వరకు అర్హులందరికీ రైతుబంధు సాయాన్ని అందజేస్తామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల సన్నాయిగూడెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో కోటీ 11 లక్షల యాభై వేల ఎకరాలకు గాను 64.77 లక్షల మంది రైతులకు రూ.5,574.77 కోట్ల రైతుబంధు సాయాన్ని జమ చేశామని తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. మరో 4 లక్షల మందికి ఈ నెలాఖరు లోగా అందిస్తామని అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోవత్సం నాటికి వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

# కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**వరంగల్, ప్రభాతసూర్యుడు :**
స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత కార్యకర్తల్లో జోష్ ఎక్కువగా కనబడుతోంది. కసి ఎక్కువగా కనబడుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నికలో పని చేసిన ఉత్సాహం ఇవాళ మీలో కనబడుతోంది. పార్టీకి ద్రోహం చేసిన కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే కసి కార్యకర్తల్లో కనబడుతుంది. ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ తీసుకుని, అందరితో సమావేశాలు పెట్టించి చివరి క్షణంలో పార్టీ మారారు. ఇలాంటి ద్రోహులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు హరీశ్‌రావు.

**శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు..**
పార్టీ మారడమంటే కార్యకర్తల మనోస్థైరాన్ని దెబ్బతీయడం, పార్టీని అవమానపరచడమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా అవకాశాలు ఇచ్చింది పార్టీ. ఆయన జీవితాంతం రుణపడి ఉన్న కూడా పార్టీకి తక్కువే. పార్టీ మారేది లేదు.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని పలు వేదికలపై చెప్పారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటాను కానీ పార్టీ మారనని పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నీతి, నిజాయితీ, విలువలు ఉంటే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. పలు సందర్భాల్లో కడియం శ్రీహరి రేవంత్ రెడ్డిని దొంగతో పోల్చారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయనకున్న రేవంత్ మాటలకు కడియం కౌంటర్ ఇచ్చారు. రేవంత్ ఓ దొంగ అని తీవ్ర విమర్శలు




చేసిన కడియం.. ఇవాళ అదే దొంగతో కాంగ్రెస్ కండువా కప్పించుకున్నాడు. ఈ వయసులో ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు పట్టుమని పది మంది లేరు. జయశంకర్ సార్ దీవెనతో ఉద్యమాన్ని ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు కేసీఆర్. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుంది. చరిత్ర చూస్తే కాంగ్రెస్ గవర్నమెంట్ ఏ రాష్ట్రంలో కూడా ఐదేండ్లు కంటే ఎక్కువ లేదు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఐదేండ్లు మాత్రమే ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు హరీశ్‌రావు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215